'ఉచితంగా బిఎస్ఎన్ఎల్ 4జి సిమ్‌లు'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో బిఎస్ఎన్ఎల్ 4జి సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో మెరుగైన సర్వీసుల కోసం తమ సిమ్‌లను 4జి టెక్నాలజీకి అప్‌గ్రేడ్ చేసుకోవాలని బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు జిల్లా టెలికాం ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ శ్రీను ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 2జి/3జి సిమ్‌లు వినియోగిస్తున్న వారు ఇంకా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 60 వేల మంది ఉన్నారని, వారికి 4జి సిమ్‌లను బిఎస్ఎన్ఎల్ ఉచితంగా అందిస్తుందని పేర్కొన్నారు. ఉచిత సిమ్‌లు బిఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ సెంటర్‌లోనూ, ఫ్రాంచైజీలు, రిటైలర్లు, ఏజెంట్ల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం వినియోగిస్తున్న సిమ్ ఏ సిమ్ అనేది తెలుసుకోవడానికి 54040 అనే నెంబర్‌కు 'ఎస్ఐఎం' అని ఎస్ఎంఎస్ పంపడం ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అందరూ వీలైనంత త్వరగా 4జి సిమ్‌కు అప్డేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు.

ధాన్యం.. దగా..!

మూడు నెలలైనా జమకాని రబీ ధాన్యం సొమ్ము

'పశ్చిమ'లో రూ.400 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.45 కోట్లు బకాయి

అదిగో..ఇదిగో అంటూ రైతులను మభ్యపెడుతున్న అధికారులు

తెచ్చిన అప్పులకు వడ్డీ తడిసి మోపెడు

సాగెలా చేయాలని అన్నదాత ఆవేదన

కూటమి ప్రభుత్వ తీరుపై రైతుల్లో అసహనం

'ధాన్యం సొమ్ము ఇవ్వకుండా గత ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. కొత్త ప్రభుత్వం వచ్చి రెండు నెలలైనా రైతుల ధాన్యం సొమ్ము గురించి పట్టించుకోవడం లేదు. ఖరీఫ్ సాగు ఆదిలోనే దెబ్బతింది. ధాన్యం సొమ్ము సకాలంలో ఇవ్వరు. ఇలాగైతే వ్యవసాయం ఎలా చేయాలి' అంటూ అన్నదాత తీవ్ర ఆవేదనకు గురవుతున్నాడు. రబీ ధాన్యం విక్రయించి మూడు నెలలైనా ఇంకా సొమ్ము జమ చేయకపోవడంపై తీవ్ర వేదనకు గురవుతున్నాడు. తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరగడంతోపాటు అప్పుల వాళ్ల నుంచి పెరుగుతున్న ఒత్తిళ్లు తట్టుకోలేక నరకయాతన అనుభవిస్తున్నారు. దీంతో రెండు జిల్లాల్లోని రైతాంగం పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గడిచిన రబీలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో పంట దిగుబడులు బాగానే వచ్చాయి. రైతులు ఆనందంగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ పంటను విక్రయించారు. అక్కడ నుంచి రైతులకు కష్టాలు మొదలయ్యాయి. నెలలు గడుస్తున్నా ధాన్యం సొమ్ము మాత్రం రైతుల ఖాతాల్లో జమకాని పరిస్థితి నెలకొంది. పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా 6.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ఏలూరు జిల్లాలో రెండు లక్షల 161 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరిగింది. నిబంధనల ప్రకారం ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేయాలి. ఏప్రిల్ 28 తర్వాత రైతుల ఖాతాల్లో సొమ్ము జమ నిలిచిపోయింది. రైతులు పెద్దఎత్తున ఆందోళన చేయడంతో కొత్త ప్రభుత్వం జులై మొదటివారంలో కొంత సొమ్ము విడుదల చేసింది. ఈ సొమ్మును మే పదో తేదీకి ముందు ధాన్యం విక్రయించిన రైతులకు మాత్రమే జమ చేశారు. పదో తేదీ తర్వాత విక్రయించిన రైతులకు సొమ్ము వేయలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో రూ.400 కోట్లు, ఏలూరు జిల్లాలో రూ.45 కోట్లు, రెండు జిల్లాల్లో మొత్తంగా రూ.445 కోట్లు ధాన్యం సొమ్ము రావాల్సి ఉంది. మే పదో తేదీ అంటే దాదాపు మూడు నెలలు గడిచిపోయింది. ధాన్యం విక్రయించిన తర్వాత మూడు నెలలపాటు సొమ్ము జమ చేయకపోతే రైతుల పరిస్థితి ఏమిటనే ఆలోచన కూడా పాలకులకు లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం వచ్చి రెండు నెలలు గడిచింది. రైతులకు సంబంధించిన ధాన్యం బకాయిలకు తొలి ప్రాధాన్యతివ్వాల్సి ఉన్నప్పటికీ సరిగ్గా పట్టించుకోవడం లేదనే ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతోంది. ధాన్యం సొమ్ము కోసం రైతులు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో జరుగుతున్న మీకోసం కార్యక్రమానికి వెళ్లి వినతులు ఇచ్చుకోవాల్సిన దుస్థితి దాపురించింది. పౌర సరఫరాల శాఖాధికారుల వద్దకు వెళ్తే అదిగో..ఇదిగో అంటూ చెప్పడం తప్ప ధాన్యం సొమ్ము మాత్రం జమకాని పరిస్థితి నెలకొంది. మూడు నెలలకు రూ.లక్ష పెట్టుబడి తెచ్చిన రైతులకు వడ్డీ నూటికి రూ.మూడు చొప్పున లెక్కిస్తే రూ.తొమ్మిది వేలు, రూ.రెండు లక్షలు అప్పు తెచ్చిన రైతు రూ.18 వేలు వడ్డీ కింద చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఎప్పుడిచ్చిన ధాన్యం సొమ్ము మాత్రమే ఇస్తుందే తప్ప వడ్డీ చెల్లించదు. దీంతో రైతుల తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం సొమ్ము వడ్డీతో చెల్లించాలని రైతులు కోరుతున్నారు. కోత యంత్రాలకు, ధాన్యం కిరాయిలు, కూలీలకు, పెట్టుబడి తెచ్చిన అప్పుల వాళ్ల నుంచి ఒత్తిళ్లు తట్టుకోలేక రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ప్రభుత్వాలు మారినా రైతుల కష్టాలు మాత్రం తీరడం లేదు. ఓపక్క ఖరీఫ్ సాగు వరదలకు దెబ్బతింది. మరోపక్క రబీ ధాన్యం సొమ్ము చేతికి రాక రైతులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ధాన్యం సొమ్ము వడ్డీతో కలిపి వెంటనే జమ చేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులు చేసిన తప్పేంటీ..

గోలి నర్సిరెడ్డి, పేరంపేట, జంగారెడ్డిగూడెం మండలం

ఆరు నెలలు కష్టపడి పండించిన పంటను విక్రయిస్తే మూడు నెలలు గడిచినా సొమ్ము ఇవ్వలేదు. పంట పండించడమే రైతులు చేసిన తప్పా ప్రభుత్వమే చెప్పాలి. మా కుటుంబం 12 ఎకరాల వరకూ రబీలో వరి సాగు చేశాం. మే 11న ధాన్యం విక్రయించాం. రూ.ఎనిమిది లక్షలు వరకూ ధాన్యం సొమ్ము రావాల్సి ఉంది. ఇప్పటి వరకూ చిల్లిగవ్వ జమ కాలేదు. మీకోసం కార్యక్రమంలో వినతిస్తే పది రోజుల్లో జమవుతాయని చెప్పారు. ఇప్పటి వరకూ జమ కాలేదు. నూక శాతం పేరుతో మిల్లర్లు ఎదురు రూ.ఆరు వేలు కట్టించుకున్నారు. కిరాయి కింద రూ.44 వేలు చెల్లించాల్సి వచ్చింది. ఇన్ని నెలలు ధాన్యం సొమ్ము ఇవ్వకపోతే రైతుల పరిస్థితి ఏమిటో ఏ ఒక్కరూ ఆలోచించడం లేదు. ధాన్యం సొమ్ము వెంటనే జమ చేయాలని కోరుతున్నాం.

పెట్టుబడికి వడ్డీ తడిసి మోపెడు

కొండేటి వెంకట నరసింహారావు, కౌలురైతు, తాడేరు, భీమవరం మండలం

రబీలో 30 ఎకరాలు సాగు చేశాను. ఇంకా 20 ఎకరాలకు సంబంధించిన ధాన్యం సొమ్ము రూ.15 లక్షలు రావాల్సి ఉంది. మే రెండో వారంలో ధాన్యం విక్రయించాం. మూడు నెలలు ధాన్యం సొమ్ములు ఇవ్వకపోతే రైతులు వ్యవసాయం ఎలా చేయాలి. ధాన్యం సొమ్ము వెంటనే జమ చేయాలని కోరుతున్నాం.

రబీ సొమ్ము రాలేదు.. సార్వా నారుమళ్లు మునిగాయి

కౌరు శ్రీను, మల్లవరం లంక, నరసాపురం మండలం

రబీలో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని వరిసాగు చేశాను. మే రెండో వారంలో 315 సారలు విక్రయించాను. దాదాపు రూ.రెండు లక్షలు ధాన్యం సొమ్ము రావాలి. మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం ఇస్తే ఈ నెల ఐదో తేదీన పడతాయని చెప్పినా పడలేదు. ట్రాక్టర్ కిరాయిలు, రబీ పెట్టుబడికి తెచ్చిన అప్పు ఇప్పటికీ తీర్చలేని పరిస్థితి నెలకొంది. మరోపక్క వరదలకు ఖరీఫ్ నారుమడులు మునిగిపోయాయి. రైతుల గురించి పట్టించుకునే నాధుడే లేకుండాపోయాడు.

మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల మాజీ ఎంఎల్‌సి శర్మ

సమాజ మార్పునకు ఐక్యంగా ఉద్యమించాలి

యువత, విద్యార్థులకు మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ పిలుపు

ప్రజాశక్తి - భీమవరం

అసమానతలు లేని సమాజం కోసం, ప్రస్తుత సమాజ మార్పుకోసం యువత, విద్యార్థులు ఐక్యంగా ఉద్యమించాలని ఉత్తరాంధ్ర జిల్లాల మాజీ ఎంఎల్‌సి, డివైఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు ఎంవిఎస్.శర్మ పిలుపునిచ్చారు. స్థానిక త్యాగరాజు భవనంలో మంగళవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యాన యువజనుల జిల్లాస్థాయి ఆత్మీయ సదస్సు నిర్వహించారు. సదస్సు ప్రారంభ సూచికగా జాతీయ పతాకాన్ని డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, సంఘ పతాకాన్ని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారత స్వాతంత్రోద్యమంలో ప్రాణాలర్పించిన మహనీయులు, సంఘ సంస్కర్తలు, అంటరానితనంపై పోరాడిన యోధులకు, స్త్రీ విద్య కోసం పోరాడిన ధీర వనితలకు, సాంఘిక సంస్కర్తలకు, ఈ ప్రాంతంలో పుట్టి ప్రపంచస్థాయిలో విద్య, వైద్య సేవలందించి గుర్తింపు పొందిన విభిన్న ప్రతిభావంతుల చిత్రపటాలకు డివైఎఫ్ఐ పూర్వ రాష్ట్ర నాయకులు బి.బలరాం, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, మాజీ జిల్లా నాయకులు జెఎన్‌వి.గోపాలన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎస్‌విఎన్.శర్మ, జిల్లా కార్యదర్శి జి.ధనుష్, ఉపాధ్యక్షులు బి.రాంబాబు, పిల్లి చంటిబాబు, తెన్నేటి స్టాలిన్, బి.బాలాజీ, శింగిరెడ్డి శేషు, ఆర్.రమేష్, పి.దుర్గ, ఎ.శ్రీదేవి అధ్యక్ష వర్గంగా సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా విచ్చేసిన శర్మ మాట్లాడుతూ యువజనులు చైతన్యం, దేశభక్తితో ఆదర్శ సమాజ నిర్మాణానికి మూల స్తంభాలుగా ఉండాలన్నారు. పాశ్చాత్య వ్యామోహాన్ని వీడి మాతృదేశంపై మమకారంతో అన్ని తరగతుల ప్రజల అభివృద్ధికి కంకణం కట్టుకుని దేశాభివృద్ధికి చిత్తశుద్ధి, ఐకమత్యం, పరస్పర సహకారంతో కృషి చేయాలన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారతీయ కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపజేయాలని పిలుపునిచ్చారు. యువత అన్ని విషయాల్లో ధైర్యంగా తాము ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు పట్టుదలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై.రాము, జి.రామన్న మాట్లాడుతూ బ్రిటీషు పాలనాకాలంలో మన దేశం అన్ని రంగాల్లో దోపిడీకి గురైందన్నారు. ఇటువంటి వలస పాలనకు వ్యతిరేకంగా భారతీయులు చేసిన ఉద్యమమే జాతీయోద్యమమన్నారు. పరాయి పాలన నుండి విముక్తి చేసి స్వాతంత్రం కోసం విద్యార్థులు, రైతులు, యువజనులు, మహిళలు, గిరిజనులు ఇలా అన్ని తరగతుల ప్రజలు ఈ పోరాటంలో పాల్గొన్నారన్నారు. వారి పోరాట ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్రమన్నారు. జాతీయోద్యమాన్ని లేదా స్వాతంత్ర పోరాటక్రమాన్ని యువతీ, యువకులకు, విద్యార్థులకు వివరించే ప్రయత్నం ఈ సమావేశ ముఖ్యోద్దేశమని సూచించారు. సమావేశంలో ప్రజానాట్యమండలి కళాకారులు ఉత్తేజభరితమైన అభ్యుదయ గీతాలతో యువజనులను అలరించారు. పలు వైవిధ్యభరితమైన సాంస్కృతిక కార్యక్రమాలతో యువజనుల ఆత్మీయ సదస్సు ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ సదస్సులో డివైఎఫ్ఐ తాజా, మాజీ నాయకులు, యువతీ, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వెబ్ సైట్లో ఓటు పొందుపర్చాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

మన దేశంలో ప్రపంచ పర్యాటకాన్ని పెంపొందించే దిశగా ప్రజల అభిప్రాయాలను తెలియజేస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వెబ్ సైట్‌లో ఓటు వేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా 'దేఖో అప్నా దేశ్ - పీపుల్స్ ఛాయిస్ 2024' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఆధ్యాత్మికం, సంస్కృతి - వారసత్వం, ప్రకృతి - వన్యప్రాణులు, సాహస కార్యకలాపాలు కేటగిరీల్లో అత్యుత్తమ పర్యాటక ఆకర్షణలపై ప్రజల అభిప్రాయాన్ని సేకరించడం, తద్వారా ప్రపంచ స్థాయి పర్యాటకం అభివృద్ధి చేయడం దీని లక్ష్యం అన్నారు. దీనిలో భాగంగా మై గోవ్ ప్లాట్‌ఫామ్‌లో ప్రత్యేక వెబ్‌పేజీని అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రజలు వివిధ కేటగిరీలలో తమకు ఇష్టమైన పర్యాటక ప్రదేశాలను సూచిస్తూ ఓటు వేయడానికి ఈ లింక్ ద్వారా https://innovateindia.mygov.in/dekho-apna-desh అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు దేఖో అప్నా దేశ్- పీపుల్స్ ఛాయిస్ 2024పై వివిధ కార్యాలయాల్లో, ఛానెల్స్, వెబ్‌సైట్‌లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ద్వారా ప్రచారాన్ని కల్పించినట్లు తెలిపారు.

వయనాడ్ బాధితులను ఆదుకోవాలని విరాళాల సేకరణ

తాడేపల్లిగూడెం: విరాళాలు సేకరిస్తున్న రైల్వేగూడ్స్ షెడ్ యూనియన్ నేతలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం టౌన్

కేరళ బాధితులను ఆదుకోవాలని కోరుతూ తాలూకా రైల్వే గుడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ వద్ద యూనియన్ అధ్యక్ష కార్యదర్శి సత్తి కోదండరామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డి మంగళవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే గుడ్స్ షెడ్ కార్మికులు వారు వేతనాలు ఉపాధి కాకుండా ఆపదలో ఉన్న సమాజాన్ని ఆదుకోవడం కోసం నిరంతరం పనిచేస్తున్నారని తెలిపారు. కేరళలో జరిగిన జల ప్రళయానికి వయనాడు జిల్లాలో సుమారు 300 మందిపైగానే మరణించారని తెలిపారు. ఈ నేపథ్యంలో శరణార్థుల కోసం అక్కడున్న సిపిఎం ప్రభుత్వం 53 సహాయ శిబిరాలను ఏర్పాటు చేసి లక్షల మందికి పునరావాసం కల్పిస్తోందని తెలిపారు. వారికి ఆదుకోవడానికి రైల్వే గుడ్స్ షెడ్ వారికి వచ్చిన ఆదాయంలో కొంత విరాళాల రూపంలో సహాయం అందించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి కేరళ రాష్ట్రాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విఎస్.రెడ్డి, కర్రి సాయిరెడ్డి, అడపా ఆంజనేయులు, కర్రి సుబ్బిరెడ్డి, ఆకుల నారాయణ, అడగర్ల కృష్ణ, మద్దాల పుత్రయ్య, బుద్దాల నాని, గాది వెంకటరావు కర్రి శ్రీనివాస్ రెడ్డి, ఎంద్రపు కృష్ణ, సత్తి దుర్గారెడ్డి, గుడిమెట్ల నాగబాబు, దుర్గ పాల్గొన్నారు.

పాలకొల్లు : కేరళ వరద బాధితుల కోసం పాలకొల్లు సిపిఎం కార్యకర్తలు మంగళవారం విరాళాలు సేకరించారు. రూ.4,600 వసూలైనట్లు సిపిఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం కార్యకర్తలు రండి కృష్ణ, కృష్ణ భగవాన్, ప్రసాద్ పాల్గొన్నారు.

పాలకోడేరు : కేరళలో ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యాలకు వయనాడు అతలాకుతలం అవ్వడమే కాకుండా వందల మంది ప్రాణాలు కోల్పోయారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సిపిఎం మండల కార్యదర్శి శేషాపు అక్రియ కోరారు. మంగళవారం మోగల్లులో సిపిఎం ఆధ్వర్యంలో విరాళాలు స్వీకరించారు. స్థానిక సెంటర్లో షాపులతోపాటు ఇంటింటా తిరిగి జోలు పట్టి సిపిఎం నాయకులు, కార్యకర్తలు విరాళాలు స్వీకరించారు. ఈ సందర్భంగా అక్రియ మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల వెంకటస్వామి, దున్న మరియమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకోడేరు : విరాళాలు సేకరిస్తున్న నేతలు

బకాయి వేతనాలివ్వాలని ఉపాధి కూలీల ధర్నా

నరసాపురం: మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు మంగళవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీల వేతనాలు చెల్లించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలు, ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తామని చెప్పిన సూపర్ సిక్స్ పథకాలకు తాము వ్యతిరేకం కాదని, అయితే వాటి అమలుకు ప్రభుత్వం కనబరుస్తున్న శ్రద్ధ కూలీలకు వేతనాలు చెల్లించడంలోనూ, రైతులకు ధాన్యం డబ్బు చెల్లించడంలోనూ చూపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో సుమారు 1,05,000 పని దినాలకుగాను రెండు కోట్ల 75 లక్షలకుపైగా బకాయి సొమ్ము రావాల్సి ఉందన్నారు. వేతన బకాయిలు విడుదల చేసి ఉపాధి కూలీలకు తక్షణం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వీరభద్రరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి గుబ్బల నాగేశ్వరరావు, నేతలు, ఉపాధి కూలీలు పిల్లి కామేశ్వరరావు, రవి, బి.శ్రీనివాస్, కె.ఆంజనేయులు, కె.శ్రీనివాస్, టి.వేణు, ఎం.విజయలక్ష్మి కె.తాతయ్య పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఉపాధి కూలీలు

బాధితులను పరామర్శిస్తున్న జనసేన నేతలు

టిడ్కో ఇంట్లో పేలుడు

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలోని టిడ్కో ఇళ్లలో సి-బ్లాక్ 71/102 ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ముగ్గురు గాయాల పాలైన ఘటన మంగళవారం తెల్లవారుజామున 5:45 గంటలకు చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోడపాడు మురళీ తాపీ పని చేసుకుని జీవిస్తున్నాడు. టిడ్కో ఇంట్లో భార్య కుమారి, కుమార్తె నీలిమతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం తెల్లవారుజామున ఒక్కసారిగా పెద్దశబ్దం రావడంతో చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురై అక్కడకు వెళ్లగా మంటలు, పొగ వస్తుండటంతో వెంటనే ఫైర్ సిబ్బందికి, 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది, రూరల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గాయపడిన వారిని 108 వాహనంలో ఏరియా ఆసుపత్రికి తరలించారు. మురళీ (36), ఆయన భార్య కుమారి (32) తీవ్రంగా గాయపడగా, కుమార్తె నీలిమ స్వల్ప గాయాల పాలైంది. గ్యాస్ సిలెండరా లేక విద్యుత్ షార్టు సర్క్యూట్‌నా ప్రమాదానికి కారణం ఏమిటనేది తేలాల్సి ఉందని ఫైర్, పోలీసు అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడేపల్లిగూడెం రూరల్ సిఐ రమేష్ తెలిపారు.

బాధితులకు అండగా ఉంటాం

జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితులకు అండగా ఉంటామని జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ చెప్పారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో వారిని బొలిశెట్టి రాజేష్ పరామర్శించారు. గ్యాస్ లీక్ అయిన సంఘటన వివరాలను బాధితుల బంధువులను అడిగి తెలుసుకున్నారు.ఏరియా ఆసుపత్రిలో వైద్యులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

పాఠశాలలో అడ్మిషన్ ఇవ్వలేదని ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలో జెసికిలి స్కూల్ వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. శ్రేష్ట పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన తన కొడుకును స్కూల్లో తొమ్మిదో తరగతిలో జాయిన్ చేసేందుకు వచ్చిన తమను పాఠశాల యాజమాన్యం బయటికి నెట్టేసిందని బాధితురాలు స్వాతి ఆరోపించారు. బాధితుల కథనం ప్రకారం తెలంగాణ రాష్ట్రం వరంగల్‌లోని నర్సంపేటకు చెందిన ఇసురం స్వాతి కొడుకు తేజుకి శ్రేష్ఠ పరీక్షల్లో ఆలిండియా స్థాయిలో 997 ర్యాంక్ వచ్చింది. వెబ్ ఆప్షన్‌లో నరసాపురంలోని జెసికిలి స్కూల్‌లో సీటు ఎంచుకున్నారు. దీంతో సోమవారం ఆమె నరసాపురంలోని పాఠశాల వద్దకు వచ్చింది. అడ్మిషన్ విషయంలో డబ్బులు డిమాండ్ చేయడంతో ఇదేమిటని తాను ప్రశ్నించానని, దీంతో తన కొడుకుకు సీటు ఇచ్చేందుకు యాజమాన్యం నిరాకరించిందని స్వాతి చెబుతున్నారు. అడ్మిషన్, పుస్తకాలకు రూ.15 వేలు అడిగారని, ఇవికాకుండా మరో రూ.35 వేలు కట్టాలని యాజమాన్యం డిమాండ్ చేసిందన్నారు. తన కొడుకుకు సీటు ఇవ్వకుండా వేరే వాళ్లకు ఆ సీటు ఇచ్చారని ఆరోపించారు. యాజమాన్యం, సిబ్బంది బయటకు నెట్టేయడంతో స్థానికులు సోమవారం రాత్రి తమకు ఆశ్రయం కల్పించారన్నారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు యాజమాన్య ప్రతినిధులు అక్కడికి చేరుకుని మళ్లీ బెదిరింపులకు పాల్పడ్డారని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. దీనిపై ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు యాజమాన్యంతో మాట్లాడగా సిబిఎస్ఇ అడ్మిషన్లు పూర్తయ్యినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. దీంతో ఆమె కూటమి నాయకులతో కలిసి మంగళవారం సాయంత్రం పాఠశాల యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఆ అబ్బాయికి సీటు ఇవ్వక పోతే ఆందోళన ఉధృతం చేస్తామని నేతలు హెచ్చరించారు. దీంతో కాసేపు అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. పట్టణ సిఐ యాదగిరి తన సిబ్బందితో అక్కడికి చేరుకుని చర్చలు జరిపారు. బుధవారం సిబిఎస్ఇ వారికి లెటర్ పెట్టి వారి ఆదేశాల ప్రకారం అడ్మిషన్ ఇస్తానని చెప్పడంతో ఆందోళన ముగించారు.

జేసికిలీ స్కూల్ వద్ద ఉద్రిక్తత

18 కాసుల బంగారం, కిలో వెండి చోరీ

పాలకొల్లు: పాలకొల్లు సమీపంలోని పూలపల్లిలో సోమవారం సాయంత్రం జనసంచారం ఉన్న సమయంలో ఒక ఇంట్లో 15 కాసుల బంగారం, కిలో వెండి వస్తువులు చోరీకి గురవ్వడం సంచలనం సృష్టించింది. వెండి వస్తువులు దొంగిలించారు. పూలపల్లి పంచాయతీ కార్యాలయానికి సమీపంలో బి.శ్రీనివాసరావు నివాసముంటున్నాడు. శ్రీనివాసరావు భార్య కృష్ణవేణి తన ఇద్దరి పిల్లలను సోమవారం సాయంత్రం ఆరు గంటలకు సమీపంలోని ట్యూషన్‌కు తీసుకెళ్లి 7.30 గంటలకు తిరిగొచ్చారు. మెయిన్ తలుపు తీయగానే ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉండటంతో.. బీరువా పరిశీలించగా 18 కాసుల బంగారం, కిలో వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై వెంటనే వారు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వంటింట్లో వస్తువులను సైతం చిందరవందరగా పడేసినట్లు గుర్తించారు. రంగంలోకి దిగిన పోలీసులు సమీపంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్నారు. బాగా తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉండొచ్చని, బాధితుల ఇల్లు సందు లోపల ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

పాలకొల్లు తహశీల్దార్‌గా దుర్గాకిషోర్

పాలకొల్లు :పాలకొల్లు తహశీల్దార్‌గా వై.దుర్గాకిషోర్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఇక్కడకు బదిలీపై వచ్చిన మధుసూదనరావు తిరిగి సొంత జిల్లా కృష్ణాకు వెళ్లడంతో కిషోర్ పాలకొల్లుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆఫీస్ సూపరింటెండెంట్ రవిరాజు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరలక్ష్మి, విఆర్‌ఒలు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

ప్రొఫెసర్ వర్మకు డాక్టరేట్

సత్కరించిన ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వెల్డింగ్ టెక్నాలజీపై పరిశోధనలు చేసిన మెకానికల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఐ.రామపవన్‌కుమార్‌వర్మకు ఆంధ్రా యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్‌లో డాక్టరేట్ ప్రదానం చేసిందని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల మేనేజ్‌మెంట్ మీటింగ్ హాల్లో యాజమాన్యం తరపున డాక్టర్ పవన్‌కుమార్‌వర్మను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్‌వర్మ మాట్లాడుతూ ఎక్స్‌పరిమెంటల్ అండ్ న్యూమరికల్ ఇన్వెస్టిగేషన్ ఆఫ్ లేజర్ బీమ్ వెల్డింగ్ ఆఫ్ మార్జింగ్ స్టీల్ 250 గ్రేడ్' అనే అంశంపై కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ పి.రామ్మూర్తిరాజు పర్యవేక్షణలో ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ సిహెచ్.శ్రీనివాసరావు కోసూపర్‌వైజర్‌గా తాను చేసిన పరిశోధనకుగాను ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు మాట్లాడుతూ డాక్టర్ పవన్ కుమార్‌వర్మ వెల్డింగ్ టెక్నాలజీపై పరిశోధనలు చేసి మంచి ఫలితాలు రాబట్టారని అభినందించారు. ఈ సందర్భంగా మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది డాక్టర్ వర్మకు అభినందనలు తెలిపారు.

వర్మను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యాం

సిఐ యాదగిరి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - నరసాపురం

సిఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న యాదగిరి

నరసాపురం పట్టణ సిఐగా బి.యాదగిరి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. 2009 బ్యాచ్‌కు చెందిన యాదగిరి గతంలో కోనసీమ, అయినమిల్లి, అమలాపురం పట్టణాల్లో ఎస్‌ఐగా పనిచేశారు. 2024లో సిఐగా ప్రమోషన్ రాగా, మొదటిసారిగా నరసాపురంలో విధులు నిర్వహించనున్నారు. తాజా బదిలీల్లో భాగంగా విఆర్ నుంచి బదిలీపై నరసాపురం వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను స్టేషన్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పాలకొల్లు రూరల్ సిఐగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

సిఐగా గుత్తుల శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సిఐగా పని చేసిన కుడుపూడి సతీష్ విఆర్‌కు వెళ్లారు. కొత్త సిఐకు పాలకొల్లు రూరల్, పోడూరు, ఆచంట, యలమంచిలి ఎస్‌ఐలు స్వాగతం పలికారు. శాంతి భద్రతలు రక్షణకు తొలి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

ఫిర్యాదులు రాకుండా నిత్యావసరాలు అందించాలి

తహాశీల్దార్ భారతీ విజయలక్ష్మి

ప్రజాశక్తి - పాలకోడేరు

తహాశీల్దార్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా నిత్యావసర వస్తువులు అందించాలని తహాశీల్దార్ భారతీ విజయలక్ష్మి అన్నారు. పాలకోడేరు తహాశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన భారతీ విజయలక్ష్మిని మంగళవారం మండల రేషన్ డీలర్లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి సమస్యలున్నా ముందుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిత్యావసర వస్తువులు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సిఎస్‌డిటి.శేషయ్య, మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దొంగ కృష్ణ, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, కోశాధికారి కొల్లా సత్యనారాయణ, కవిత, సూరిబాబు, మాణిక్యం పాల్గొన్నారు.

చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ఆచంట

చేనేత కార్మికుల కుటుంబాలు అర్ధాకలితో అలమటిస్తూ దుర్భర జీవితం గడుపుతున్నాయని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు అల్లరి సూర్య భాస్కరరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదో జాతీయ చేనేత దినోత్సవాన్ని గ్రామ, మండల, జిల్లా స్థాయిలో ఘనంగా నిర్వహించాలన్నారు. చేనేత కార్మికులు నేత నేసిన వస్త్రాలకు కూలి డబ్బులు అందక, పొట్టకూటి కోసం నమ్మిన వృత్తిని వదలలేక దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. చేనేత కార్మికులు అర్ధాకలితో అలమటిస్తున్నారని వాపోయారు. చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గణపవరం : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక డిగ్రీ కాలేజీలో చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో పాల్గొన్న ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి మాట్లాడుతూ చేనేత కార్మికులకు కావాల్సిన యంత్రాన్ని కనుగొన్న చింతకింద మల్లేష్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ఆయనపై రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కార్యక్రమంలో లెక్చరర్లు సిహెచ్ చైతన్య, కె.స్వరూపరాణి, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

మార్టేరు ప్రభుత్వాస్పత్రికి ఫ్యాన్లు అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రభుత్వాసుపత్రుల వల్ల సామాన్య ప్రజలకు చక్కని వైద్యం అందుతోందని మానవత మండల అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి అన్నారు. సంస్థ తరపున రూ.పది వేల విలువైన నాలుగు సీలింగ్ ఫ్యాన్లను మంగళవారం మార్టేరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ షేక్ చవీర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఎంతో సేవ చేస్తున్న ప్రభుత్వ వైద్యులను, ఆశాలను అభినందించారు. సేవా కార్యక్రమాలకు మానవత ముందుంటుందని రీజినల్ ఛైర్మన్ బాణాల శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు, ఆసుపత్రి వైద్యసిబ్బంది, మానవత జిల్లా ప్రతినిధి కొత్త సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

కాళ్ల :తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

తల్లిపాలు దివ్యౌషధం

ప్రజాశక్తి - కాళ్ల

రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో తల్లిపాలు దివ్యౌషధంగా పనిచేస్తాయని ఆకివీడు ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి వాణి విజయరత్నం అన్నారు. ఏలూరుపాడులో తల్లిపాల వారోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ముందుగా ర్యాలీ నిర్వహించి తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ అధికారి వాణి విజయరత్నం మాట్లాడుతూ తల్లులు చంటి పిల్లలకు పాలు ఇవ్వడం వల్ల కేన్సర్‌తో పాటు గుండె జబ్బులు కూడా దరి చేరవన్నారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందించి సన్మానించారు. కార్యక్రమంలో జువ్వలపాలెం సెక్టార్ అంగన్వాడీ సూపర్‌వైజర్ పార్వతి, అంగన్వాడీ వర్కర్స్ ఆర్.లక్ష్మి, ఎవిఎం.లక్ష్మి, డి.కాశీరత్నం, భవాని, లక్ష్మి, ఎఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

పెనుగొండ : తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమని వడలి సెక్టార్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రుతుకుమారి తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆమె మాట్లాడారు. తల్లి గంటలోపు బిడ్డకు ముర్రిపాలు పట్టించడం వల్ల బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గణపవరం : మండలంలో జల్లికాకినాడ పంచాయతీ వద్ద మంగళవారం అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి గ్రామ సర్పంచి బాతు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. అనంతరం సర్పంచి నాగేశ్వరరావు, ఎఎన్ఎం ఝాన్సీలక్ష్మి మాట్లాడారు. ముర్రిపాలు బిడ్డకు పుట్టిన గంటలోపు పట్టాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ధనలక్ష్మి, రాణి, విజయకుమారి, ఇందిర పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : తిల్లపూడి గ్రామం పాటిగరువు అంగనవాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల విశిష్టతను గ్రామ సర్పంచి నడపన శ్రీనివాస్ వివరించారు. కార్యక్రమంలో ఎంపిటిసి నడపన నరసింహస్వామి, మాజీ మండల పరిషత్ వైస్ ఛైర్మన్ దిడ్ల రామాంజనేయులు, పాఠశాల ఉపాధ్యాయులు అప్పన భీమారావు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మొగల్తూరు పంచాయతీ పరిధి నక్కవారిపాలెం రామన్నపాలెం పంచాయతీ పరిధి యాళ్ల వారి మెరకలో సిడిపిఒ ఊర్మిల అధ్యక్షతన తల్లిపాలపై మాట్లాడారు.

బాలింతలకు బేబీ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

ఆపదలో ఉన్న వారికి తమ వంతు సాయం అందించేందుకు మానవత సేవా సంస్థను ఏర్పాటు చేసినట్లు మానవత మండల అధ్యక్షుడు కుక్కల లీలా ప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఇద్దరు బాలింతలు గంధం ధనలక్ష్మి, యాండ్ర దేవీదుర్గకు బేబీ కిట్లతో పాటు పండ్లు, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఛైర్మన్ నంబూరి అంజిబాబు, ఆత్మీయ సహకార కమిటీ సభ్యులు కొమ్మనపెద్ది సూర్యనారాయణ మూర్తి (శర్మ), మండల ఉపాధ్యక్షులు బొక్కా రామకృష్ణ, మండల కార్యదర్శి నిమ్మకాయల గంగారామ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రైతుల ఆశలపై నీళ్లు..!

కుళ్లిపోతున్నో నారుమడులు, నాట్లు

అన్నదాత ఆందోళన

ప్రజాశక్తి - ఆచంట

పెనుమంచిలిలో దెబ్బతిన్న వరి నాట్లు

రాను రాను వ్యవసాయం చేయడం రైతులకు కష్టంగా మారింది. ప్రకృతి కరుణిస్తేనే పంటలు చేతికందే పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఆచంట నియోజకవర్గంలో ఏళ్ల తరబడి నక్కల డ్రెయిన్ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఆచంట, పెనుమంచిలి, ఆచంట వేమవరం, రైతుల పరిస్థితి అతివృష్టి, అనావృష్టిగా తయారైంది. రబీలో నీటి ఎద్దడి, ఖరీఫ్‌లో ముంపు ఏటా పరిపాటిగా మారడంతో అన్నదాతల పరిస్థితి అయోమయంగా తయారైంది. మూడు గ్రామాల పరిధిలో సుమారు ఏడెకరాల ఆయకట్టులో వరి సాగు అవుతోంది. ఈ విస్తీర్ణం తాలూకా రైతులకు ఏ పంట గ్యారెంటీ లేదు. ఆక్రమణలకు గురైన డ్రెయిన్లు, వంటకాలవలే ఈ దుస్థితికి కారణమని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10 రోజుల కిందట కురిసిన అధిక వర్షాలకు, వరదలకు డ్రెయిన్లు పొంగి పొలాలన్నీ నీట మునిగాయి. డ్రెయిన్లలో గురపుడెక్క, తూడు తొలగించకపోవడంతో ఇంకా నాట్లు కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఖరీఫ్‌పై రైతుల ఆశలు సన్నగిల్లాయి. పది రోజుల వ్యవధిలోనే రెండు సార్లు నాట్లు, నారుమడులు నీట మునగడంతో ఖరీఫ్‌పై ఆశలు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. డ్రెయిన్లు, పంట కాలువలు ఆక్రమణలు తొలగించి ఎప్పటికప్పుడు తూడు గుర్రపుడెక్క తొలగిస్తే గానీ ఖరీఫ్ పంట దక్కే అవకాశం లేదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

నియోజకవర్గంలో నెలకొన్న ప్రతికూల వాతావరణం సార్వా సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గత జులై నెలలో కురిసిన అధిక వర్షాలతో నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో సాగు పనులు ఇప్పటికీ ముందుకెళ్లని పరిస్థితి. ఒకవైపు గోదావరికి దఫ దఫాలుగా వస్తున్న వరదలు, మరోవైపు అస్తవ్యస్తంగా మారిన డ్రెయినేజీ వ్యవస్థలతో మండలాల్లో వేలాది ఎకరాల్లో వరి నారుమడులు, నాట్లు ముంపు బారిన పడి దెబ్బతిన్నాయి. ముంపు ప్రాంతాల్లో నీరు పూర్తిగా తగ్గితే తప్ప మరోమారు చేల్లో విత్తనాలు చల్లుకునే పరిస్థితి కనిపించడం లేదు. సాధారణ పరిస్థితిలో కనబడుతున్న చోట ఇప్పుడిప్పుడే కొందరు రైతులు తిరిగి చేలలో విత్తనాన్ని చల్లుతున్నారు. ఈ తరహాలో నారు కొనుగోలు, రవాణా, కూలీలు ఇతర ఖర్చుల కోసం ఎకరానికి రూ.7 వేల వరకూ అదనపు పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది.

నష్టంపై క్షేత్రస్థాయిలో చురుగ్గా సర్వే..

అధిక వర్షాలు, వరదలతో ముంపు బారిన పడిన ప్రాంతాల్లో వరి నాట్లు విస్తరణాన్ని గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వే జరుగుతుందని ఆచంట మండల ఎఇఒ బి.నాగరాజు తెలిపారు. నష్టం నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. నారుమళ్లు దెబ్బతిన్నచోట తక్కువ కాల పరిస్థితితో కూడిన వరి విత్తనాలు రైతులకు 80 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తున్నామన్నారు. కౌలు రైతుల్లో చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ముంపు సమస్య నుంచి బయటపడిన ప్రాంతాల్లో వీలైనంత తొందరగా వరి నాట్లు పూర్తి చేసుకోవాలి. సాధారణంగా వరి నారు మిగిలేలా విత్తనాన్ని చల్లడం నియోజవర్గంలో ఆనవాయితీ. మిగిలిన నారుని సేకరించి నాట్లు వేసుకోవడానికి రైతులు తొలి ప్రాధాన్యతివ్వాలి. నారు లభ్యత లేనిచోట్ల 120 రోజులకే పంట నిచ్చే విత్తనాలు చల్లుకోవాలి.

అంగన్వాడీ కేంద్రానికి వంట సామగ్రి అందజేత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వంట సామాగ్రి అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు కార్తీక్

లోసరి అంగన్‌వాడీ కేంద్రానికి ఇర్రింకి సూర్యారావు భవాని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో మంగళవారం కేంద్రానికి కావాల్సిన వంట సామగ్రితో గ్లాసులు, కంచాలు, గ్యాస్‌స్టవ్, కుక్కర్, సామాన్లను ట్రస్ట్ సభ్యులు కార్తీక్ అందించారు. ఈ సందర్భంగా కార్తీక మాట్లాడుతూ సూర్యమిత్ర అధినేత సూర్యారావు భవాని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముఖ్యంగా తీర ప్రాంతంలోని అంగన్వాడీ కేంద్రాలకు వంటసామగ్రిని అందించామని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ టీచర్ పెచ్చెట్టి లక్ష్మీతులసి ట్రస్ట్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఉద్యాన పంటల నిధులను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం:జిల్లాలో వివిధ ఉద్యానవన పంటల సాగుకు 2024-25 సంవత్సరానికి కేటాయించిన నిధులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. జాతీయ ఆహార నూనె గింజల పథకం కింద రూ.252.20 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, జిల్లాలో ఈ పథకం ద్వారా 300 హెక్టార్లలో పామాయిల్ పంట సాగు లక్ష్యంగా నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. దీనికి గాను ఒక హెక్టారు ఆయిల్ పామ్ మొక్కలకు దేశీయ రకానికి రూ.20 వేలు, విదేశీయ రకానికి రూ.29 వేలు రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. నాలుగు సంవత్సరాల కాలంలో సంవత్సరానికి ఎరువులు మరియు అంతరపంట వేసినందుకు రూ.10,500 రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాలో రాష్ట్రీయ కృషి వికాస యోజన పథకం కింద 40 హెక్టార్లు లక్ష్యంగా 15.25 లక్షల రూపాయలు కూరగాయల పంటల అభివృద్ధికి అందజేయడం జరుగుతుందన్నారు.

చిట్టీల పేరుతో మోసం

మొగల్తూరు:మండలంలోని కెపి పాలెం సౌత్ గ్రామానికి చెందిన చిట్టీల వ్యాపారి ప్రజలకు రూ.కోట్లలో టోకరా వేశాడు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సుంకర శ్రీను గత కొంతకాలంగా చిట్టీల పాట నిర్వహిస్తున్నాడు. చిట్టీలు పడుకున్న వ్యక్తులకు కూడా నగదు ఇవ్వడం లేదు. ఇలా సుమారు రూ.నాలుగు కోట్ల వరకూ చెల్లించలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు నిరసన ప్రదర్శన చేశారు. అధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కె.వెంకటరమణ తెలిపారు.

పేదలకు భోజనం పెట్టడం అదృష్టం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పేదల కడుపు నింపే అవకాశం రావడం అదృష్టమని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తాలూకా ఆఫీస్ సమీపంలోని అన్నాక్యాంటీన్ వద్ద టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం కక్షతో అన్నా క్యాంటీన్లను నిలిపేసి పేదల కడుపు కొట్టిందన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వంలో ఆగస్టు 15 నుంచి అన్నా క్యాంటీన్లు ప్రారంభమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

రంగరాజు మాస్టార్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని చెరుకువాడకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు గాదిరాజు రంగరాజుకు ఆచార్య మొగరాల రామనాథం నాయుడు పర్యవేక్షణ్లో 'పశ్చిమగోదావరి జిల్లా నాటక రంగ వికాసం 'అనే విషయంపై సునిశితంగా పరిశోధన చేసి తన సిద్ధాంత గ్రంధాన్ని కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం మైసూర్‌లోని తెలుగు అధ్యయన పరిశోధన విభాగానికి పిహెచ్‌డి పట్టా కోసం సమర్పించారు. ఆ గ్రంధాన్ని పరిశీలించి ఉత్తమమైందని నివేదికలను అందించి పరిశోధకులైన గాదిరాజు రంగరాజుకు పిహెచ్‌డి పట్టా ప్రదానం చేయొచ్చని సిఫార్సు చేశారు. ఈ మేరకు కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం మైసూరు రాజును డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. ఈ మేరకు మంగళవారం అవార్డు అందినట్లు రంగరాజు మాస్టారు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ కబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి, కార్యదర్శి ముదునూరి శివరామరాజు, మానవత మండల అధ్యక్షులు పెన్మెత్స రామకృష్ణంరాజు, ఛైర్మన్ రుద్రరాజు యువరాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు సబ్సిడీపై విత్తనాల పంపిణీ

ఆచంట:ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై విత్తనాలు అందజేస్తోందని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అన్నారు. మంగళవారం మండలం ఎ.వేమవరం, వల్లూరు గ్రామాల్లో నారుమడులు దెబ్బతిన్న రైతులకు 80 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేశారు. విత్తనాలు ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పంపిణీ చేశారు. ఆచంట వేమవరంలో సర్పంచి జక్కంశెట్టి చంటి వల్లూరు గ్రామంలో ఉప సర్పంచ్ గెద్దాడ శ్రీనివాసరావు అధ్యక్షతన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులకు రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న విత్తనాలు సద్వినియోగం చేసుకుని ఆకుమడులు వేసుకోవాలని కోరారు. మండల ఇన్‌ఛార్జి వ్యవసాయ అధికారి బి.నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు ఎర్రగుప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్, టిడిపి, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : వరిధనంలో రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోడి విజయ భాస్కర్, పాముల రజినీకుమార్, నెక్కింటి ఆదినారాయణ, ఇంటి శ్రీరాముడు, అందెకోటి వీరభద్రం పాల్గొన్నారు.

చదివిన కళాశాలకే పిన్సిపల్‌గా..

విఇసి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా ప్రభువరం నియామకం

ప్రజాశక్తి - వీరవాసరం



ప్రభువరంను అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

వీరవాసరం విఇసి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా అదే కళాశాలలో అధ్యాపకునిగా కొనసాగుతున్న చాబత్తుల ప్రభువరం నియమితులయ్యారు. ఈ మేరకు రాజమండ్రి ఇంటర్మీడియట్ రీజనల్ జాయింట్ డైరక్టర్ నుంచి మంగళవారం ఉత్తర్వులు వచ్చినట్టు ఆయన తెలిపారు. ఇదే కళాశాలలో ఇంటర్ చదవి, ఈ కళాశాలలోనే 1988 నుంచి ఒకేషనల్ కోర్సు అధ్యాపకునిగా తన ప్రస్థానం ప్రారంభించి నేడు ప్రిన్సిపల్‌గా నియమితులవ్వడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కళాశాలకు పూర్వవైభవం తీసుకురావడంలో ప్రభువరం పాత్ర ఎంతో ఉందని తెలిపారు. ప్రాథమిక విద్య ఎలిమెంటరీ పాఠశాలలో, హైస్కూల్ విద్య ఎంఆర్‌కె హైస్కూల్ వీరవాసరంలో, బిటెక్ జెఎన్‌టియులో పూర్తిచేసిన ఆయన ప్రిన్సిపల్ స్థాయికి చేరుకోవడంతో ఆయనను ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్‌నాయుడు, మాజీ ఎంపిపిలు జుత్తిగ నరసింహమూర్తి, వీరవల్లి చంద్రశేఖర్, మాజీ సర్పంచి వీరవల్లి రామకృష్ణ, గుండా రామకృష్ణ, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు జివివి.రామానుజరావు, గ్రామస్తులు మద్దాల సత్యనారాయణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు బాజంకి కృష్ణారావు, కళాశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సామాజిక కార్యకర్తలు

సాగరం పోరాటం వెలకట్టలేనిది

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో గ్రామగ్రామాన అనేక మంది ఉద్యమ కారులుగా పోరాటానికి ముందుకొచ్చారని, మహాత్మాగాంధీ పిలుపు మేరకు పస్తుల సాగరం పోరాటం వెలకట్టలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భారత స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాలను చినరంగనిపాలెం పస్తుల సాగరం మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా దేశ నాయకుల చిత్రాలతో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పస్తుల సాగరం కుటుంబ సభ్యులను సత్కరించారు. పస్తుల సాగరం మనవడు పస్తుల హరిప్రసాద్ మాట్లాడుతూ ఆనాటి ఉద్యమంలో నిస్వార్థంగా ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్యం కోసం పోరాడారన్నారు. భీమవరంలో జన్మించిన తాతయ్య సాగరం ఉద్యమంలో పాల్గొనడం తమ కుటుంబానికి గౌరవం అందిందన్నారు. హైస్కూల్ ఇన్‌ఛార్జి హెచ్ఎం బొక్కా గోపీనాథ్, ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, సిపిఐ నాయకులు మల్లుల సీతారామ్ ప్రసాద్, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు గాంధీజీ కలలు కన్నా స్వరాజ్యం వస్తుందా అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పస్తుల సాగరం ముని మనవుడు పస్తుల రఘురామ్ (లండన్), లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎన్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పట్టణంలోని వైఎన్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చినమిల్లి సత్యనారాయణరావు పుట్టిన రోజును పురస్కరించుకుని రక్తదాన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చినమిల్లి మాట్లాడుతూ నేటికీ రక్తదానంపై అనేక అపోహలు ఉన్నాయన్నారు. రక్తదానం చేయడం వల్ల బలహీనతకు దారితీస్తుందని చాలా మంది అనుకుంటున్నారని అది అపోహ మాత్రమేనని తెలిపారు. రక్తదానం అందరి బాధ్యత అన్నారు. ప్రస్తుతం నిరుపేదలకు రక్తం కొరత ఏర్పడుతోందని, పలు స్వచ్ఛంధ సంస్థలు రక్త నిధి కేంద్రాలను ఏర్పాటుచేసి వాటి ద్వారా పేదవారికి ఉచితంగా రక్తాన్ని అందిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ రక్త దానం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రక్త దానం చేయడం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, కళాశాల అకడమిక్ అడ్వయిజర్ ఆర్‌వి.సుబ్బారావు, డీన్ గంధం శ్రీరామకృష్ణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్లు యాకోబు, సోమేశ్వరి, ఎన్‌సిసి ఆఫీసర్ శ్యాంబాబు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

మొగల్తూరు: మొగల్తూరులో రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఇన్‌ఛార్జి కలెక్టర్ ఉదయ్‌భాస్కర్‌కు కిసాన్ మోర్చా నాయకులు వినతిపత్రం అందజేశారు. మొగల్తూరులోని కొనాయికోడు మురుగు డ్రెయిన్ ప్రక్షాళన, గ్రామంలోని నాగదేవత ఆలయ సమీపంలోని రాయి చెరువు తొలగించాలని వినతిపత్రంలో పేర్కొన్నామని తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బిజెపి రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు తోట గంగరాజు, జిల్లా అధ్యక్షులు దాసరి బాబి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

పెనుమంట్ర:జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలనూ బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని విద్యాశాఖ కాకినాడ ఆర్‌జెడి జిల్లా ఇన్‌ఛార్జి డిఇఒ జి.నాగమణి అన్నారు. మంగళవారం మార్టేరు కళ్యాణ మండపం వేదికపై జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయుల వార్షిక విద్యా సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతిరోజు పాఠశాలకు 20 శాతం కూడా విద్యార్థులు హాజరు కావడం లేదని, రోజూ విద్యార్థుల హాజరు 92 నుండి 95 శాతం తప్పనిసరిగా ఉండే విధంగా పాఠశాల సిబ్బంది బాధ్యత తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా పాఠశాలకు రాని విద్యార్థులను గుర్తించి పాఠశాలకు తీసుకురావాల్సిన బాధ్యత ఆయా ప్రధానోపాధ్యాయులదేనని అన్నారు. ప్రతి విద్యార్థీ యూనిఫామ్ తప్పనిసరిగా ధరించి పాఠశాలకు వచ్చే విధంగా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని తెలిపారు. ఈ సదస్సులో జిల్లాలోని మూడు డివిజన్ల డివైఇఒలు మురళీ సత్యనారాయణ (తణుకు), ఎన్.శ్రీనివాసరావు (భీమవరం), రవీంద్ర భారతి (తాడేపల్లిగూడెం) పాల్గొన్నారు.

రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గత ప్రభుత్వం రజకులను పట్టించుకోకపోగా, ఇబ్బందులు పెట్టిందని రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మడకా రాజు తెలిపారు. రజక వృత్తిదారుల సంఘం జనరల్ బాడీ సమావేశం మంగళవారం స్థానిక చుక్కా అప్పలస్వామి భవనంలో అడ్డాల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో రజకులపై హత్యలు, అత్యాచారాలు, వెలివేతలు జరిగాయన్నారు. రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయలేదన్నారు. రక్షణ చట్టం ఏర్పాటు చేయలేని పక్షంలో రజకులు ఆందోళనలు, పోరాటాలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమలో యండమూరి నాగేంద్ర, టేకు శ్రీను, కొడమంచిలి వాసు పాల్గొన్నారు.

ఉండి ఎస్ఐ లక్ష్మణ్ బదిలీ

ప్రజాశక్తి - ఉండి

ఉండి ఎస్ఐ మందపల్లి లక్ష్మణ్ బదిలీపై ద్రాక్షారామం వెళ్లారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు తర్వాత జరుగుతున్న సాధారణ బదిలీల్లో భాగంగా లక్ష్మణ్ ఉండి స్టేషన్ ఎస్ఐ విధుల నుండి రిలీవ్ అయినట్లు స్టేషన్ సిబ్బంది తెలిపారు. లక్ష్మణ్ పార్టీలకతీతంగా పారదర్శకంగా విధులు నిర్వర్తించారని పలువురు కొనియాడారు.

భీమవరం తహశీల్దార్‌గా రాంబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం తహశీల్దార్‌గా రావి రాంబాబు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు డిప్యూటీ తహశీల్దార్ మొక్క అందించి స్వాగతించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం, భీమవరం వద్ద సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఎలక్షన్ బదిలీల్లో భాగంగా కృష్ణా జిల్లా పెడన తహశీల్దార్ పనిచేసి తిరిగి భీమవరం తహశీల్దార్‌గా వచ్చారు.

అంతా ఇంటర్నెట్ మయమే

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రస్తుతం అంతా ఇంటర్నెట్ మయమేనని నైస్ ఇంటర్నెట్ అధినేత ఇళ్ల వాసు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నైస్ ఇంటర్నెట్ సెంటర్లో వరల్డ్ వైడ్ వెబ్ (డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ) ఇంటర్నెట్‌పై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. 1989లో సేరన్‌లో ఉన్నప్పుడు వెబ్‌ను ఆంగ్ల కంప్యూటర్ శాస్త్రవేత్త టిమ్ బెర్నర్స్ లీ కనిపెట్టారన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నరహరిశెట్టి కృష్ణ మాట్లాడుతూ భారత్‌లో ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకుని సరికొత్త పరిశోధనలు చేయాలన్నారు. అనంతరం ఇళ్ల వాసును సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది ఉండపల్లి రమేష్, సుంకర చంద్, పులపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ప.గో.జిల్లా, గణపవరం మండలం, గణపవరం గ్రామ కాపురస్తులైన తమతపు రవి కిషోర్ తండ్రి వెంకటేశ్వరరావు అను నేను నా యొక్క పాస్ పోర్ట్ గణపవరం SBI సెంటర్లో జిరాక్స్ తీయించుకుని మా ఇంటికి వచ్చే మార్గ మధ్యలో పాస్ పోర్ట్ నెంబర్ M7738658 పాస్ పోర్ట్ మరియు జిరాక్స్‌తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు ఎంత వెతికిన దొరికలేదు దొరికినవారు ఈ కింది నెంబర్‌కు తెలియజేయవలసినది గలరు.

తమతపు రవి కిషోర్, తండ్రి వెంకటేశ్వరరావు
గణపవరం గ్రామం, గణపవరం మండలం
పశ్చిమగోదావరి జిల్లా. సెల్ . 8985345222

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా నిడమర్రు మండలం క్రొవ్విడి గ్రామ కాపురస్తులైన మానుకొండ సునీత భర్త జాన్ మోస్ అను నేను నా యొక్క పాస్ పోర్ట్ క్రొవ్విడి నుండి నిడమర్రు మా బంధువులు ఇంటికి వెళ్లే మార్గమధ్యలో పాస్ పోర్ట్ నెంబర్ N5374345 పాస్ పోర్ట్ మరియు జిరాక్స్‌తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు దొరికిన వారు ఈ కింది నెంబర్ కు తెలియజేయవలసినది గలరు.

మానుకొండ సునీత
భర్త జాన్ మోస్, క్రోవిడి గ్రామం, నిడమర్రు
మండలం ఏలూరు జిల్లా.
సెల్ . 8886329159

ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, (సీనియర్ డివిజన్)

O.S.No.7/2014

వాది: పుచ్చకాయలు నవీన్
Vs
ప్రతివాదులు : పుచ్చకాయలు కృష్ణమూర్తి (Died) వగైరా

నోటీసు

To.
3వ ప్రతివాది : నల్లి జయదుర్గ, భర్త సువర్ణరాజు, డోర్‌నెం. 2-2/55, చలువపేట, నర్సాపురం టౌన్.
4వ ప్రతివాది : దేశాబత్తుల వెంకట లక్ష్మి, భర్త వెంకటేశ్వరులు, డోర్‌నెం. 2-2/55, చలువపేట, నర్సాపురం టౌన్.
6వ ప్రతివాది : పుచ్చకాయలు హేమలత, భర్త వెంకటరమణ, డోర్‌నెం. 2-2/55, చలువపేట, నర్సాపురం టౌన్, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు O.S.No.7/2014 3,4,6వ ప్రతివాదులు అయన మీకు పైకోర్టు నుండి ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినను అమలు జరగనందున ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా మీరు ది.13-8-2024వ తేదీన ఉదయం గం.10.00 ని.లకు శ్రీకోర్టు వారి ఎదుట స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని, హాజరు అయ్యి మీ అభ్యంతరములు తెలియజేసుకొనవలెను. లేనియెడల సదరు పై దావాని మీ పరోక్షమున తీర్మానించబడును, గాన మీకు తెలియజేయడమైనది.

కోర్టు ఉత్తర్వుల ప్రకారం

దేవ రంజిత్ కుమార్, చొప్పల అశోక్,
నర్సాపూర్ వాది తరపున అడ్వకేట్స్, నర్సాపురం.
తేది.6-8-2024 సెల్: 98483 32116